క్లుప్తంగా

దివ్యాంగుడికి ఎంపీ సన్మానం


హరికృష్ణను అభినందిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన సురేష్ షెట్కార్‌ను కలిసి సన్మానించేందుకు మెదక్ జిల్లా రేగోడు మండలం మర్పల్లికి చెందిన దివ్యాంగుడు హరికృష్ణ సోమవారం నారాయణఖేడ్‌లోని ఎంపీ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్‌షెట్కార్ దివ్యాంగుడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తనపై ఉన్న అభిమానంతో ఇంతదూరం రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అతడిని శాలువాతో సన్మానించారు. అనంతరం కొంత నగదును అందజేసి అభినందించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

డీడీలు వాపసు చేయాలి

నారాయణఖేడ్: గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు గొర్రెలనైనా పంపిణీ చేయాలని లేదా డీడీలైనా వాపసు చేయాలని జెడ్పీటీసీ లక్ష్మీబాయి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారులు డీడీలు చెల్లించి ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. కానీ.. అటు గొర్రెలు పంపిణీ చేయక.. ఇటు డీడీలు వాపసు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి డీడీలు చెల్లించినవారు వడ్డీల భారం మోయలేకపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందింది. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని గోకుల్‌నగర్ కాలనీ చెందిన దండు కమలమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 15వ తేదీన కడుపునొప్పి తీవ్రంగా రావడంతో భరించలేక యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల విధుల డబ్బులు చెల్లించాలి


మాట్లాడుతున్న రమేష్

నారాయణఖేడ్: ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు డబ్బులు చెల్లించాలని నారాయణఖేడ్ డివిజన్ సీఐటీయూ నాయకుడు నల్లపల్లి రమేష్ డిమాండ్ చేశారు. ఆ సంఘం కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో మున్సిపల్, ఆశావర్కర్లు విధులు నిర్వర్తించారని తెలిపారు. కానీ.. ఇప్పటివరకూ రెవెన్యూ అధికారులు డబ్బులు చెల్లించకపోవడం విచారకరమన్నారు. తక్కువ వేతనంతో ఇబ్బందులు పడుతున్న వీరికి ఎన్నికల విధుల డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు. నాయకులు సతీష్, పవన్, సంతోష్ పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వాతినక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భార్గవ లక్ష్మీనరసింహస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతినక్షత్రం సందర్భంగా ఉదయం పంచామృత అభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, ప్రత్యేక హోమం, రాత్రి 7గంటలకు స్వామివారి దివ్యమంగళ కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిన్నారంలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్లు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి చెందిన వైద్యులు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ప్రయాణం.. నరకప్రాయం

- గంతలమయంగా రహదారులు
- ధ్వంసమవుతున్న సీసీ రోడ్లు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి

పల్లెల్లోనే కాదు.. పట్టణాల్లోనూ రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. సీసీ రోడ్లు సైతం సిమెంట్ లేచిపోయి అధ్వానంగా మారాయి. సంవత్సరాలు గడుస్తున్నా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

– జహీరాబాద్ టౌన్


తహసీల్దార్ కార్యాలయం దారిలో ధ్వంసమైన రోడ్డు


దెబ్బతిన్న శివాలయం రోడ్డు

జహీరాబాద్ పట్టణం విస్తీర్ణం రోజు రోజుకు పెరుగుతోంది. వాహనాల రద్దీ కూడా ఎక్కువైంది. పట్టణంలో ఎక్కడ చూసినా దెబ్బతిన్న రోడ్ల కారణంగా వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. అంతర్గత రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జహీరాబాద్ పట్టణంలోని బాక్స్ రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు, మున్సిపల్ కార్యాలయం, హౌసింగ్‌బోర్డు, దత్తగిరి కాలనీ, శాంతినగర్, హనుమాన్ మందిరం, భవానీ మందిరం తదితర కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించారు. అయితే పదేండ్ల వరకు దెబ్బతినకుండా ఉండాల్సి రోడ్లు నాసిరకం పనుల కారణంగా నెలల వ్యవధిలోనే గుంతలమయంగా మారుతున్నాయి.

అడ్డగోలుగా రోడ్ల తవ్వకం పనులు

వాటర్ పైపులైన్, కేబుల్ తీగల పేరుతో రోడ్లను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత రోడ్లకు మరమ్మతులు చేపట్టకుండా వదిలేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు ఎక్కడ గుంతలు ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. దీంతో ప్రజలు రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేపడతామని వివరణ ఇచ్చారు.

అధ్వానంగా రోడ్లు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు


గుంతలమయంగా మారిన మలపాడ్ గ్రామానికి వెళ్లే రోడ్డు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని యెట్టిగడ్డసంగం, మలపాడ్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి దారిపొడువునా రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లోకి వర్షం నీరు భారీగా చేరడంతో వాహనదారులకు గుంతలను తప్పించబోయి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అడుగులోతు గుంతలు ఏర్పడినా పట్టించుకునేవారేకరువయ్యారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సింగూర్ పర్యాటక ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు, పర్యాటకులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుతురుకు గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే గుంతలమయంగా మారిన రోడ్లను బాగు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గుంతల రోడ్లతో పరేషాన్

బొల్లారం మున్సిపల్ కార్యాలయం ముందు రోడ్డు సరిగా లేకపోవటంతో ఓ వాహనం గుంతలో పడి కూరుకుపోయింది. కార్యాలయం ముందే ఈ పరిస్థితి ఉంటే మున్సిపల్ పరిధిలోని కాలనీల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు)


మున్సిపల్ కార్యాలయం ముందు గుంతలో కూరుకుపోయిన వాహనం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైఫెయిర్ విల్లాస్ నుంచి ఉస్మాన్‌నగర్ వెళ్లే మార్గంలో రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ మార్గంలో డ్రైనేజీ పైపులైన్ వేసేందుకు గుంతను తవ్వారు. ఆ తర్వాత పనులు పూర్తయిన మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనాలు గుంతలో పడిపోతున్నాయి. అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)


గుంతలో కూరుకుపోయిన కారు


ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అందరికీ అండగా ఉంటాం

మునిపల్లి(అందోల్): ప్రతిఒక్కరికీ బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన దేశం ప్రహ్లాద్‌రెడ్డి 2023 డిసెంబర్ 7వ తేదీన ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండటంతో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మృతుడి భార్య లక్ష్మికి రూ.2లక్షల చెక్కును సోమవారం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లావ్యాప్తంగా బక్రీద్ పండుగను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలుచోట్ల పేదలకు పండ్లు పంపిణీ చేశారు. జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ నారాయణఖేడ్ పట్టణంలో మైనార్టీ సోదరుల వద్దకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


జహీరాబాద్: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


సదాశివపేట పట్టణంలో..


హత్నూరలో..


మునిపల్లి: అలయ్ బలయ్ తీసుకుంటున్న చిన్నారులు


నారాయణఖేడ్‌లో..


మునిపల్లిలో..


న్యాల్‌కల్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


జిన్నారంలో..


కంగ్టిలో..


పటాన్‌చెరులో..


రామచంద్రాపురంలో..


కల్హేర్‌లో..


ఝరాసంగంలో..


సంగారెడ్డిలో..

ఆర్థికసాయం అందజేత

పటాన్‌చెరు టౌన్: కోవిడ్ సమయంలో స్నేహితుడు మృతి చెందడంతో అప్పటి నుంచి అతని కూతురు చదువులకు అవసరమైన సాయం అందిస్తూ వస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణ ధర్మ పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్‌చెరు పట్టణానికి చెందిన అభిషేక్‌గౌడ్, అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్‌కు చెందిన శ్రీను స్నేహితులు. అయితే.. శ్రీను కోవిడ్ సమయంలో మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి శ్రీను కూతురు మౌనికను చదివిస్తూ వస్తున్నాడు. ఇటీవల విడుదలైన ఆల్ ఇండియా జేఈఈలో మౌనిక 5వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా సోమవారం మౌనికను అభినందించి ఉన్నత చదువులకు రూ.2లక్షల ఆర్థికసాయం అందజేశారు. మౌనిక కుటుంబ సభ్యులు అభిషేక్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మౌనిక కుటుంబసభ్యులతో అభిషేక్‌గౌడ్

జిన్నారం మండల పరిధిలో...

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కిష్టాయిపల్లి గ్రామానికి చెందిన తలారి సత్యనారాయణ కుమారుడి ఇంటర్ చదువుల కోసం మాజీ వార్డు సభ్యుడు సందయ్యగారి ఇంద్రసేనారావు సోమవారం రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనాయణ కుటుంబ సభ్యులు ఇంద్రసేనారావుకు కృతజ్ఞతలు చెప్పారు.


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఇంద్రసేనరావు

పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): ఎన్సీఎల్ వేకా పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కిషన్‌రావు డిమాండ్ చేశారు. కట్టు కాలువను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన పెద్దచెరువు కట్టు కాలువలో పరిశ్రమ యాజమాన్యం చెత్తాచెదారంతో నింపి చెరువులోకి నీరు రాకుండా చేస్తోందన్నారు. ఈ విషయమై పరిశ్రమ యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కట్టు కాలువలో పూడిక తీయించి ఎన్ సీఎల్ వేకా పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


కట్టు కాలువలోని చెత్తాచెదారాన్ని చూపుతున్న ఎంపీటీసీ కిషన్‌రావు

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని వావిలాల గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–1999 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జిన్నారంలోని రైతువేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.


1998-1999 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

పాలస్తీనాకు మద్దతుగా నినాదాలు

జహీరాబాద్: పాలస్తీనాకు మద్దతుగా ముస్లింలు నినాదాలు చేశారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఈద్గా వద్ద బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం పలువురు ముస్లిం యువకులు పాలస్తీనా జెండాను ప్రదర్శించారు. పాలస్తీన ప్రజల విషయంలో ఇజ్రాయిల్ అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు.


పాలస్తీనా జెండాను ప్రదర్శించి నినాదాలు చేస్తున్న ముస్లిం యువకులు

ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆరూర్ శివారులో ఉన్న పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.